మండలంలో విద్యాభివృద్ధికి కృషి

● ఎంఈవో వెంకటయ్య



గచ్చిబౌలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్య అందరికి అవసరం.. విద్యతోనే మానవ మనుగడ సాగుతుంది.. విద్యతోనే మెరుగైన సమాజం ఏర్పడుతుందని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం కొన్ని సంవత్సరాల క్రితమే విద్యాహక్కు చట్టం తీసుకువచ్చింది. ఈ చట్టం సక్రమంగా అమలు జరగడం లేదు. ఈ చట్టం అమలుకావాలంటే పాలకులు, ప్రభుత్వం విద్యా సంస్థలకు పూర్తి అవగాహన కల్పించాలి. మెరుగైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు ముందుకురావాల్సిన అవసరం ఉంది. శేరిలింగంపల్లి మండల విద్యాధికారి వెంకటయ్యతో ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూ

శేరిలింగంపల్లి మండలంలో విద్యాహక్కుచట్టం సక్రమంగా అమలవుతుందా?

ఈ చట్టం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ఈ విషయం అందరికి తెలిసిందే. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు తలుచుకుంటే పూర్తిస్థాయిలో అమలవుతుంది.

మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఎన్ని ఉన్నాయి?

ప్రభుత్వ పాఠశాలలు 42 ఉన్నాయి. అందులో సుమారు 16 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలు సుమారు 300 ఉన్నాయి. వాటిలో సుమారు 1,47,000 మంది విద్యార్థులు చదుకుంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సదుపాయాలు ఉన్నాయా?

ప్రభుత్వ పాఠశాలలో తాగు నీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయాలు ఉన్నాయి.

శిథిలావస్థలో ఉన్న భవనాలు ఉన్నాయా? విద్యుత్ బిల్లులు వస్తున్నాయా?

శేరిలింగంపల్లి మండలంలో పాఠశాలలకు కొన్ని ప్రైవేటు సంస్థ లు సీఎస్ఆర్ ఫండ్స్ కింద నిధులు కేటాయించి అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారు. విద్యుత్ బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తుంది.

మధ్యాహ్న భోజనం అమలులో అవకతవకలు ఉన్నాయా? బిల్లులు సక్రమంగా ఇస్తున్నారా?

రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం శేరిలింగంపల్లిలో అమలవుతుంది. కొంతమంది మధ్యాహ్న భోజన ఉద్యోగులు కోర్టుకు వెళ్లి తిరిగి మళ్లీ మేమే చేస్తామని ఆర్డర్ తీసుకువచ్చారు. కొన్ని పాఠశాలల్లో వారే నిర్వహిస్తున్నారు. వారికి గతంలో రావాల్సిన బిల్లులు చెల్లించాల్సి ఉంది.

క్రీడల అభివృద్ధికి ఏ విధంగా కృషి చేస్తున్నారు?

ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా ఉపాధ్యాయులు లేకపోవడం, ఉన్న పాఠశాలల్లో వారికి క్రీడా మైదానాలు లేక క్రీడల్లో వెనుకబడి ఉన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులను, మైదానాలు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది.

కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా

● అధికార పార్టీ నాయకుడి అండతోనేనన్న స్థానికులు
● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

గచ్చిబౌలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలే కాకుండా జీహెచ్ఎంసీ పార్కులను సైతం కబ్జా చేస్తున్నారు. విషయం తెలిసినా అధికారులు అందినంత దండుకొని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్‌లో పార్కుకు ఎకరం స్థలం కేటాయించారు. స్థలాన్ని కొందరు కబ్జా చేసి శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేస్తే నామమాత్రంగా చర్యలు తీసుకోవడంతో తిరిగి పనులు ప్రారంభిస్తున్నారు. స్థానికులు ఇటీవల ఫిర్యాదు చేస్తే జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఉద్యోగి వెళ్లి పనులను నిలిపివేశారు. రెండు రోజుల తర్వా తిరిగి పనులను ప్రారంభించారని స్థానికులు తెలిపారు.



పార్కుస్థలంలో జరుగుతున్న నిర్మాణ పనులు



వార్డు కార్యాలయం వద్ద వేసిన గుడిసెలు

వార్డు కార్యాలయం పక్కనే గుడిసెలు

అంజయ్యనగర్‌లో పార్కు పక్కనే రెండువేల గజాల్లో జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయం ఉంది. దానిచుట్టూ ప్రహరీతోపాటు భవనం నిర్మించారు. కార్యాలయం పక్కనే కొద్ది రోజుల క్రితం గుడిసెలు వెలిశాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఓట్లను దండుకునేందుకు గుడిసెలు వేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో భూములు కబ్జా

శేరిలింగంపల్లి సర్కిల్‌లో భూములకు రూ. కోట్ల విలువ ఉంది. ఎక్కడ చూసినా గజం లక్షరూపాయల పైనే. సైబర్‌టవర్‌కు కూతవేటు దూరంలో ఉన్న పార్కు, వార్డు కార్యాలయం స్థలం ఖరీదు గజం రూ. 2 లక్షల వరకు ఉంటుంది. విలువైన స్థలాలు కబ్జా అవుతున్నా అధికారులు నిర్లక్ష్యం చేయడంలో ఆంతర్యం ఏమిటో తెలియడం లేదు.

ఓ నాయకుడి అండదండలతో..

గత ప్రభుత్వ హయాంలో ఓ నాయకుడి అండదండలతో గుడిసెలు వెలిసినట్లు, తాత్కాలిక నిర్మాణాలు జరిగినట్లు సమాచారం. శేరిలింగంపల్లిలో కోట్ల రూపాయల విలువైన స్థలాలు అన్యాక్రాంతం అయిన విషయం తెలిసిందే. కొండాపూర్‌లోని పార్కు, వార్డు కార్యాలయాన్నీ వదలలేదని తెలుస్తోంది. పార్కు స్థలంలో ఇటీవల శాశ్వత భవనాల పనులను ప్రారంభించగా.. స్థానికులు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు పరిశీలించడానికి వెళ్లగా.. మనవారే కడుతున్నారని అధికార పార్టీ నాయకుడు అధికారులను బెదిరించినట్లు తెలిసింది. ప్రభుత్వ స్థలాలను కాపాడాలని అధికారులను పలువురు కోరుతున్నారు.



వార్డు కార్యాలయం

హైడ్రా ఏం చేస్తోంది?

సైబర్ టవర్‌కు కూతవేటు దూరంలోగల జీహెచ్ఎంసీ పార్కు కబ్జా అవుతున్నా.. హైడ్రా ఏం చేస్తోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు మిన్నకుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కబ్జా మా దృష్టికి వచ్చింది.. చర్యలు తీసుకుంటాం

అంజయ్యనగర్‌లో వార్డు కార్యాలయం, పార్కు స్థలం కబ్జా విషయం మా దృష్టికి వచ్చింది. త్వరలో కూల్చివేస్తాం.

- వెంకటరమణ, ఏసీపీ, శేరిలింగంపల్లి సర్కిల్

ఓక్రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ పరిశీలన



ఓక్రిడ్జి పాఠశాలను సందర్శించిన విద్యా కమిషన్ చైర్మన్, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళీ

రాయదుర్గం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని ఓక్రిడ్జి ఇంటర్నేష నల్ స్కూల్‌ను తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళీ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యావిధానాన్ని, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో తెలంగాణ విద్య కమిషన్ సభ్యులు కందాడి జ్యోత్స్న శివారెడ్డి, వెంకటేష్, పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

76 టపాసుల దుకాణాలకు అనుమతి

చందానగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చందానగర్ సర్కిల్ పరిధిలో దీపావళికి పండుగ జరుపుకునేందుకు అధికారులు ఇప్పటికే సమీక్షలు నిర్వహించారు. బాణసంచా ద్వారా ఎలాంటి అపశృతులు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. టపాసుల దుకాణాలు నివాసాలకు దూరంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. సర్కిల్ పరిధిలో మంగళవారం నాటికి 76 టపాసుల దుకాణాలకు అనుమతులు ఇచ్చారు. మరికొన్ని ప్రాసెస్‌లో ఉన్నాయని ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేసి ప్రమిదలు అమ్మకాలు చేస్తున్నారు. భారీ టపాసులు కాల్చడం ఫ్యాషన్‌గా మారుతుంది. చిన్న పిల్లలు టపాసుల జోలికి వెళ్లనివ్వకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది.



చందానగర్, గంగారంలో టపాసుల దుకాణాలు, ప్రమిదలు

సౌత్‌జోన్ కబడ్డీ టోర్నమెంట్‌కు జేఎన్‌టీయూ మహిళా జట్టు ఎంపిక

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నవంబరు 20వ తేదీ నుంచి అలగప్ప యూనివర్సిటీలో జరుగనున్న సౌత్‌జోన్ కబడ్డీ టోర్నమెంట్‌కు జేఎన్‌టీయూ మహిళా జట్టును మంగళవారం ఎంపిక చేసినట్టు స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ దిలీప్ తెలిపారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫిజికల్ డైరెక్టర్ అశోక్ ఆధ్వర్యంలో జరిగిన సెలక్షన్స్‌కు వివిధ కళాశాలల నుంచి 90 మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఆయన వెల్లడించారు. జేఎన్‌టీయూ కబడ్డీ మహిళా జట్టు ఎంపిక ప్రక్రియకు ముఖ్యఅతిథిగా వర్సిటీ పరీక్షల విభాగం సంచాలకులు ప్రొఫెసర్ అరుణకుమారి, చీఫ్ సెలెక్టర్లుగా డాక్టర్ సోమేశ్వర్, కుమార్‌యాదవ్ హాజరయ్యారని, జట్టుకు ఎంపికైన క్రీడాకారులను వారు అభినందించినట్టు పేర్కొన్నారు.



కబడ్డీ సెలక్షన్స్‌కు హాజరైన క్రీడాకారులు, ఉన్నతాధికారులు

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలి

హైదర్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలపై ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని మంగళవారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. జీతాలు సకాలంలో అందేలా, అంగన్‌వాడీలకు శాశ్వత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే గాంధీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శోభన్, కృష్ణ, నాగమణి, శ్రీలత, టీచర్లు లక్ష్మి, ప్రవీణ, లక్ష్మీకాంతం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మియాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ ఆర్టీసీ డిపో-2 పరిధిలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని మియాపూర్, బాచుపల్లి, మల్లంపేట్, నిజాంపేట పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్టీసీ బస్సు సర్వీసులకు సంబంధించి సమస్యలు, సలహాలు తెలిపేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉదయం 11 నుంచి 12.00 గంటల వరకు 9959226420 నంబర్‌ని సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని మోసం

● కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు

హైదర్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సొంతింటి కోసం ఆరాటపడే పేదల ఆశను అసరాగా చేసుకొని డబ్బులు కడితే ఇల్లు ఇప్పిస్తానని ఓ వ్యక్తి మోసానికి పాల్పడిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం.. బోయినపల్లికి చెందిన వేణుగోపాల్ దాస్ అనే వ్యక్తి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇప్పిస్తానని కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ ప్రాంతాలకు చెందిన పలువురు మహిళలకు నమ్మబలికారు. ఒక్కొక్కరి దగ్గర రూ.1.75 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు వసూలు చేశాడు. ఇలా 15 మంది నుంచి రూ.25 లక్షలు వసూలు చేశాడు. ఎంపీ ఎలక్షన్ అయిపోయిన తర్వాత డబ్బులు చెల్లించిన అందరికి ఇళ్లు వస్తాయని చెప్పాడు. ఎన్నికల తర్వాత బాధితులకు నకిలీ పత్రాలను, నకిలీ తాళాలను అందజేశాడు. ఇళ్ల పత్రాలు, తాళాలు తీసుకున్న వారు దుండిగల్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల దగ్గరికి వెళ్లి చూస్తే అసలైన లబ్ధిదారులు అక్కడ ఇళ్లలో ఉండటంతో మోసపోయినట్లు గుర్తించారు.

మంగళవారం బాధిత మహిళలు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు ఫిర్యాదు చేయగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయాలని బాధితులకు సూచించారు. ఈ మేరకు బాధితులు 8 మంది కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాధితులు 15 నుంచి 20 మంది వరకు ఉన్నట్లు తెలుస్తుంది.

లక్కీ రెస్టారెంట్‌కు రూ.50 వేల జరిమానా

చందానగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): హోటల్స్‌లో అపరిశుభ్రంగా ఉంటే ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని ఆ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి అన్నారు. మియాపూర్ లక్కీ రెస్టారెంట్‌ను అధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. వంటగది పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం గమనించిన అధికారులు రూ.50 వేల జరిమానా విధించారు.

కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ రవి, శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



రెస్టారెంట్ నిర్వాహకులకు జరిమానా విధిస్తున్న అధికారులు

ప్రభుత్వ భూములను కాపాడాలి

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడ సర్వే నంబర్ 149లో కోట్లాది రూపాయాల విలువైన ప్రభుత్వ స్థలాన్ని జీవో 59ను దుర్వినియోగం చేస్తు రెగ్యులరైజేషన్ చేసిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వినతిపత్రం అందజేశారు. ఖాజాగూడ సర్వేనెంబర్ 27లో ప్రభుత్వ భూమిని రక్షించాలని, సున్నం చెరువును మట్టితో పూడ్చి అక్రమ లేఔట్ వేసిన భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు నాగపూర్ తరహాలో మెట్రోరైలు మార్గం విస్తరించాలని కోరారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ భూములను, చెరువులను రక్షిస్తామని, డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ మెట్రోమార్గంపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు.



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

రోడ్డు విస్తర్ణ పనుల పరిశీలన

మియాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ హైటెక్‌ఫుడ్ కోర్టు నుంచి యశోద హాస్పటల్, భారత్‌పెట్రోల్ పంపు నుండి హైటెక్‌సిటీ ఫ్లైఓవర్ వరకు జరుగుతున్న సీసీరోడ్డు, సర్వీస్ రోడ్డు విస్తర్ణ పనులను మంగళవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని రోడ్డు విస్తర్ణ చేయడం జరుగుతుందని, నాణ్యత ప్రమాణాలతో వేగంగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రోడ్డు అందుబాటులోకి వస్తే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వాహనదారులకు ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. ఇప్పటికే హైటెక్‌సిటీ పరిసర ప్రాంతాల్లో అండర్‌పాస్ వేలు, ఫ్లైఓవర్లు నిర్మించడం జరిగిందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ శర్మ, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ప్రసాద్, స్థానికులు పాల్గొన్నారు.

కాలుష్య నిబంధనలను ఉల్లంఘిస్తే పరిశ్రమలను మూసివేస్తాం.!

● టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి హెచ్చరిక

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కాలుష్య నిబంధనలను ఉల్లంఘించిన పరిశ్రమలను మూసి వేయడంతో పాటు యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) సభ్య కార్యదర్శి రవి హెచ్చరించారు. కాలుష్యం, దుర్వాసన సమస్యలపై నగరంలోని పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో పీసీబీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. పారిశ్రామిక ప్రాంతాల్లో దుర్వాసనను నియంత్రించడంలో పారిశ్రామిక సంఘాలు క్లస్టర్ల వారీగా కీలక పాత్ర పోషించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిని సంఘాల ప్రతినిధులు గుర్తించకపోతే, ఆ ప్రాంతంలోని అన్ని పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిర్ణీత సమయంలో టాస్క్‌ఫోర్స్ అధికారులందరూ తనిఖీలు నిర్వహించాలని, పరిశ్రమల్లోని పరికరాల నాణ్యత, నిర్వహణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా గాలి కాలుష్యాన్ని నియంత్రించే స్క్రైబర్ల నిర్వహణ కోసం ప్రతి పరిశ్రమలో డ్యూటీ చార్ట్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎఫ్లూయెంట్స్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, వ్యర్థ జలాలను అక్రమంగా విడుదల చేయడాన్ని గుర్తించాలన్నారు. పర్యావరణం పట్ల నిర్లక్ష్యాన్ని టీజీపీసీబీ ఎట్టి పరిస్థితుల్లో సహించబోదన్నారు.

ప్రజారోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం..

ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం టీజీపీసీబీ మొదటి ప్రాధాన్యంగా తీసుకుంటున్నదని సభ్య కార్యదర్శి రవి వెల్లడించారు. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టుపక్కల పారిశ్రామిక బెల్ట్‌లో వెలువడుతున్న దుర్వాసనపై నివాసితుల నుంచి ప్రజావాణి ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా టీజీపీసీబీకి అనేక ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని పరిశీలించి సత్వర చర్యలకు ఆదేశించామన్నారు. అ తర్వాత ఆయన ఫార్మాస్యూటికల్, కెమికల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు చెందిన పారిశ్రామిక ప్రతినిధులతో దుర్వాసన నియంత్రణ చర్యల అమలు, కాలుష్య నియంత్రణకు మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయడం, పర్యవేక్షణ యంత్రాంగాలను మెరుగుపర్చడం తదితర అంశాలపై చర్చించారు.

సమావేశంలో చీఫ్ ఇంజనీర్ రఘు, సామాజిక శాస్త్రవేత్త ప్రసన్నకుమార్, జాయింట్ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మనూలో 'జర్నలిజం ఆఫ్ మహాత్మాగాంధీ' పై సదస్సు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాట సమయం లో మహాత్మాగాంధీ జర్నలిజం విలువలను కాపాడేలా అనేక ప్రయత్నాలు చేశారని ఇండియన్ సొసైటీ ఆఫ్ గాంధీ స్టడీస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సతీష్‌కుమార్ రాయ్ అన్నారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం ఆధ్వర్యంలో 'జర్నలిజం ఆఫ్ మహాత్మా గాంధీ' పేరుతో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. జర్నలిజం విలువలు కాపాడేలా యువ న్యాయవాదిగా సౌత్ ఆఫ్రికా నుంచి స్వాతంత్ర్య పోరాటం వరకు గాంధీ చేసిన పోరాటాన్ని ఆయన వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం అన్యాయం అని ఏఐఎస్ఎఫ్ పేర్కొంది. అధికారంలోకి వస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చిందని, బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాన్‌ప్రొఫెషనల్ విద్యార్థులకు రూ.2000 కోట్లు, ప్రొఫెషనల్ విద్యార్థులకు రూ.4000 కోట్ల ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

సైబర్ మోసానికి యువకుడి బలి

మల్కాజిగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో సైబర్ మోసానికి గురై అధికమొత్తంలో డబ్బులు పోగొట్టుకున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి గౌతంనగర్‌లో కె.వంశీకుమార్(31) జిమ్ నిర్వహిస్తున్నాడు. వంశీకుమార్ తండ్రి వెంకటేశ్వర కుమార్ రైల్వే ఏఎస్ఐగా విధు లు నిర్వహిస్తున్నాడు. వంశీకుమార్ ఇటీవల ఆన్‌లైన్ మోసాలకు గురై అధిక మొత్తంలో డబ్బులు పోగొట్టుకున్నాడు. తన తండ్రిని సైతం ఫైనాన్సియల్ సపోర్టుచేయమని అడిగాడు. ఈ నెల 27న జిమ్‌కు వెళ్ళిన కుమారునికి వెంకటేష్‌కుమార్ ఫోన్‌చేయగా ఫోన్‌లిఫ్ట్ చేయలేదు. జిమ్‌కు వెళ్లి చూడగా అక్కడ జిమ్‌లో సీలింగ్‌కు వంశీకుమార్ ఉరేసుకుని కనిపించాడు. కిందకు దింటి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు తెలిపారు. వెంకటేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



స్వామికి అభిషేకం చేస్తున్న గురుస్వామి

అయ్యప్ప స్వామికి పూజలు

చందానగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చందానగర్, మదీనగూడ అయ్యప్ప ఆలయంలో అయ్యప్పస్వామి జన్మనక్షత్రమైన ఉత్తర నక్షత్రం సందర్భంగా మంగళవారం స్వామి వారికి పంచామృతాభిషేకాలు ప్రసాద గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. అయ్యప్ప మాలాధరణ భక్తులకు భిక్ష, సాయంత్రం స్వామివారి గీతాలాపాన చేశారు.



లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు పత్రాలను అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

సీఎం సహాయనిధి మంజూరు పత్రం అందజేత

హైదర్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న మనస్విని అత్యావసర వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంది. ఆమెకు మంజూరైన రూ.2.50 లక్షల మంజూరు పత్రాలను జీవీఆర్ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా వెంకటేష్‌గౌడ్



చందానగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా చందానగర్‌కు చెందిన శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కట్ట వెంకటేష్ గౌడ్‌ను నియమించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వెంకటేష్‌గౌడ్ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

హెచ్‌సీయూ అధ్యాపకుడికి అరుదైన గుర్తింపు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగ సీనియర్ ప్రొఫెసర్ అశ్విన్ నాంగియాకు ప్రపంచస్థాయి గుర్తింపు లభించింది. పరిశోధకుల ఉత్పాదకత, పనినాణ్యత, ప్రభావం.. తదితరాంశాలను అధ్యయనం చేసి ర్యాంకింగ్స్ ఇచ్చే సంస్థ స్కాలర్ జీపీఎస్ టాప్-30 జాబితాలో ఆయన చోటు సంపాదించారు. అరుదైన గుర్తింపు అందుకున్న ఆయన్ను వర్సిటీ ఉన్నతాధికారులు అభినందించారు.

రేపు రన్ ఫర్ యూనిటీ

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రన్ ఫర్ యూనిటీ దశాబ్ది వేడుకలను ఈనెల 31న నిర్వహించనున్నట్టు కూకట్‌పల్లి స్వచ్ఛభారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాధవరం కాంతారావు ఓ ప్రకటనలో తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిజాంపేట్ క్రాస్ రోడ్డు ఎదురుగా ఉన్న పటేల్ విగ్రహం నుంచి కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయానికి రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి మల్కాజిగిరి, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం రన్‌ఫర్ యూనిటీలో జాతీయ జెండాలతో ఐక్యతా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

హైదరాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం అన్యాయమని ఏఐఎస్‌ఎఫ్ పేర్కొంది. అధికారంలోకి వస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చిందని, బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తోందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాన్ ప్రొఫెషనల్ విద్యార్థులకు రూ.2000 కోట్లు, ప్రొఫెషనల్ విద్యార్థులకు రూ.4000 కోట్ల ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

చెట్టును నరకడం ఇక కష్టమే

- హైడ్రా అనుమతి తప్పనిసరి
- అర్బన్ బయోడైవర్సిటీ ఆటలు ఇక చెల్లవు

రాత్రికి రాత్రి చెట్లు కొట్టేయడం లేదా పూర్తిగా తొలగించడం ఇక అంత సులువు కాదు. ఇంటి నిర్మాణం, పార్కింగ్ కోసం, షెడ్ల నిర్మాణం పేరుతో చెట్లను నరికివేస్తే పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలుగుతుంది. దీనికి హైడ్రా అడ్డుకట్ట వేయనుంది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇటీవల జీహెచ్‌ఎంసీ, అటవీశాఖ అధికారులతో సమావేశమై చర్చలు జరిపిన విషయం తెలిసిందే. దీంతో కూకట్‌పల్లి ప్రాంతంలో పనిచేస్తున్న యూబీడీ అధికారులు, సిబ్బంది పునరాలోచనలో పడ్డారు.

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి జోన్‌లో అర్బన్ బయోడైవర్సిటీ పరిధిలో సర్కిల్‌కు ఇద్దరు మేనేజర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరికింద వార్డు, లేదా రెండింటికీ కలిసి ఒకరు చొప్పున క్షేత్రస్థాయిలో సిబ్బంది చెట్ల కొమ్మలు తొలగించడం లేదా ఎవరైనా అనుమతి లేకుండా చెట్లు కొడితే ఆ సమాచారం ఉన్నతాధికారులకు చేరవేస్తే జరిమానాలు విధించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో ఆయా చెట్టు కాలవ్యవధి, చెట్టు రకాన్ని బట్టి ఎంత ఫైన్ వేయాలనే నిర్ణయం జోన్ పరిధిలోని యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ చేతిలో ఉంటుంది. అప్పుడప్పుడు పత్రికలు, లేదా సోషల్ మీడియాలో వైరల్ అయినప్పుడు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫైన్ వేసే అలవాటును పక్కన పెట్టారని చెప్పవచ్చు. రాజకీయ నాయకులు లేదా ఉన్నతాధికారుల నుంచి ఎవరైన చెబితే తప్ప.. క్షేత్రస్థాయిలో ప్రజలకు అసౌకర్యంగా ఉన్న ప్రాంతాల్లో పర్యటించి చెట్ల కొమ్మలను కొట్టేయడం మర్చిపోయారని చెప్పవచ్చు. ఈదురు గాలుతో కూడిన వర్షాలకు చెట్ల కొమ్మలు విరిగి రోడ్లు, వాహనాలపై పడ్డ సమయంలో కాస్త హడావిడి తప్పితే మిగతా రోజుల్లో బూతద్దం పెట్టి చూసినా అర్బన్ బయోడైవర్సిటీ మేనేజర్లు లేదా అసిస్టెంట్లు ఎక్కడా కన్పించరని కాలనీల ప్రజలు చెబుతున్నారు. ఒక్కో సర్కిల్‌కు ఒకరు చొప్పున హైడ్రా నుంచి స్పెషల్ అధికారి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ఉన్న భారీ వృక్షాలకు రక్షణ కల్పించడంతో పాటు ప్రమాదకరంగా ఉన్న వాటిని త్వరగా తొలగించడానికి కూడా చర్యలు తీసుకుంటారని చెబుతున్నారు. ఇది ఒక రకంగా ప్రజలకు మంచి చేస్తోందని ఆశిస్తుండగా.. మరో పక్క యూబీడీ అవినీతికి అడ్డుకట్ట పడే అవకాశాలు ఉండడంతో వారికి మింగుడుపడడం లేదు. ఇది ఇప్పుడు కూకట్‌పల్లి జోన్ పరిధిలోని కూకట్‌పల్లి, మూసాపేట్, గాజులరామారం, కుత్బుల్లాపూర్, అల్వాల్ సర్కిళ్ల పరిధిలో పనిచేస్తున్న యూబీడీ అధికారులు, సిబ్బంది చర్చించుకుటుండడం గమనార్హం. హైడ్రా వస్తే ఎవరెక్కడ ఎంత మేర పనిచేశారనేది లెక్కల్లోకి రానుంది. దీంతో పెండింగ్ పనులు త్వరగా పరిష్కారమవుతాయని కూకట్‌పల్లి ప్రజలు ఆశిస్తున్నారు.

జరిమానాలు అంతంత మాత్రమే..

కూకట్‌పల్లి జోన్ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లను నరికేయడం సర్వసాధారణమైంది. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి ముడుపులు అందితే తప్పని పరిస్థితి ఎంతో కొంత జరిమానా? లేదంటే హెచ్చరించి వదిలేసినట్టు సంఘటనా స్థలానికి వెళ్లి నటిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మొక్కలు, చెట్ల సంరక్షణను తీసుకోవాల్సిన అధికారులే తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. హైడ్రా వచ్చిన తర్వాతనైనా ఇటువంటి వాటికి అడ్డుకట్ట పడనుందా అనే సందేహమే. వేచి చూడాలి మరి.



కేపీహెచ్‌బీ మూడోఫేజ్ ఇండోర్ షటిల్ కోర్టు సమీపంలో అనుమతి లేకుండా నరికేసిన చెట్టు (ఫైల్)

87126 99394కు కాల్ చేస్తే నిమిషాల వ్యవధిలో ఫైరింజన్

- టపాకాయలు కాల్చేటప్పుడు అప్రమత్తత అవసరం
- అన్ని కుటుంబాల్లో వెలుగులు విరజిల్లాలి
- కూకట్‌పల్లి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ తోట జగన్మోహన్



ఈ వారం అతిథి

దీపావళి పర్వదినాన కుటుంబ సభ్యులంతా కలిసి దీపాలను వెలిగించి, టపాకాయలు కాలుస్తూ ఆనందంగా గడపాలి. తాత్కాలికంగా టపాకాయల విక్రయాలు జరిపే దుకాణదారులు నిబంధనలను పాటిస్తూ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. టపాకాయలు కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఆనందమయ దీపావళిగా జరుపుకొంటారని కూకట్‌పల్లి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ తోట జగన్మోహన్ ఆశిస్తున్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎస్‌ఎఫ్‌వో (స్టేషన్ ఫైర్ ఆఫీసర్) పలు విషయాలను వెల్లడించారు.

- కేపీ హెచ్‌బీకాలనీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి)

ఎన్ని దుకాణాలకు దరఖాస్తులొచ్చాయి? ఎన్ని తిరస్కరించారు?

కూకట్‌పల్లి, బాచుపల్లి మండలాల పరిధిలో 200 దరఖాస్తులొచ్చాయి. వీటిలో పరిశీలించి 30 దరఖాస్తులను తిరస్కరించాం. గల్లీలు, రోడ్లు, నివాస సముదాయాలు, బస్టాపుల్లో పెట్టుకున్న వాటికి అనుమతి ఇవ్వలేదు. కొందరు మేము సూచించిన విధంగా నిబంధనలు పాటిస్తామని హామీ ఇవ్వడంతో వెసులుబాటు ఇచ్చాం. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉన్న ప్రాంతాల్లోనే టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నాం. పోలీస్, జీహెచ్‌ఎంసీ అనుమతులు కూడా ఉండాల్సిందే. నిబంధనలను అతిక్రమిస్తే దుకాణం సీజ్ చేసి ఆర్డీవో అనుమతితో మాల్‌ను కాల్చివేస్తాం. ప్రతి దుకాణం వద్ద రెండు డ్రమ్ముల నీళ్లు, కనీసం నాలుగు కేజీలు ఉండే రెండు ఎస్టింగ్ విషర్స్ తప్పనిసరిగా ఉండాలి. 18 సంవత్సరాల లోపు పిల్లలను దుకాణాల్లో పనిచేయించరాదు. దుకాణాల వద్ద నో స్మోకింగ్ బోర్డులు పెట్టాలి. దుకాణాల ముందు వాహనాలు నిలపకూడదు. ఏదైనా ప్రమాదం సంభవించినపుడు అందరూ బయటకొచ్చేలా ఉండాలి.

టపాకాయలు కాల్చేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

పిల్లలు, పెద్దలు అన్న తేడా లేకుండా అందరూ కాటన్ దుస్తులు ధరించి, కళ్లద్దాలు పెట్టుకొని టపాకాయలు పేల్చాలి. ఇంట్లో ఎట్టి పరిస్థితుల్లో కాల్చకూడదు. ఇంటి ముందు రోడ్డు లేదా మైదానంలో కాల్చేటప్పుడు మిగతా వారికి ఇబ్బంది లేకుండా చూసుకోవాలి. ఒకేసారి ముట్టించిన దాన్ని మరోసారి కాల్చే ప్రయత్నం చేయకూడదు. తల్లిదండ్రుల సమక్షంలోనే పిల్లలు టపాసులు కాల్చేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏదేని పెద్ద ప్రమాదం సంభవిస్తే నీటితో ఆర్పుతూ వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. కూకట్‌పల్లి, బాచుపల్లి పరిసర ప్రాంత ప్రజలు, ఇతరులు కూడా 8712699394లో 24/7 ఎప్పుడైనా ఫోన్‌చేస్తే నిమిషాల వ్యవధిలో ఫైరింజన్‌తో సంఘటనా స్థలానికి వస్తాం.

ఘనంగా తుమ్మల మోహన్ పుట్టినరోజు వేడుక



బాలవికాస్‌లో తుమ్మల మోహన్‌కుమార్ అందించిన పుస్తకాలతో చిన్నారులు

హైదర్‌నగర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పుట్టినరోజును ఆడంబరంగా జరుపుకోవడం కంటే సమాజం పట్ల సేవాభావం కలిగివుండడం ముఖ్యమని కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజా సేవకుడు తుమ్మల మోహన్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా కూకట్‌పల్లిలోని బాలవికాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫర్ డిజేబుల్ చిల్డ్రన్స్‌లో వారి అభిమానులు, పిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం చిన్నారులకు నోట్‌బుక్స్, పెన్నులు, బిస్కెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మానసిక వైకల్యం ఉన్న చిన్నారులతో కలిసి పుట్టినరోజు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, రాజు, శారద, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ టోర్నమెంట్‌కు జేఎన్‌టీయూ మహిళా జట్టు ఎంపిక



కబడ్డీ సెలక్షన్స్‌కు హాజరైన క్రీడాకారులు, ఉన్నతాధికారులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నవంబరు 20వ తేదీ నుంచి అలగప్ప యూనివర్సిటీలో జరుగనున్న సౌత్‌జోన్ కబడ్డీ టోర్నమెంట్‌కు జేఎన్‌టీయూ మహిళా జట్టును మంగళవారం ఎంపిక చేసినట్టు స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ దిలీప్ తెలిపారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫిజికల్ డైరెక్టర్ అశోక్ ఆధ్వర్యంలో జరిగిన సెలక్షన్స్‌కు వివిధ కళాశాలల నుంచి 90 మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఆయన వెల్లడించారు. జేఎన్‌టీయూ కబడ్డీ మహిళా జట్టు ఎంపిక ప్రక్రియకు ముఖ్యఅతిథిగా వర్సిటీ పరీక్షల విభాగం సంచాలకులు ప్రొఫెసర్ అరుణకుమారి, చీఫ్ సెలెక్టర్లుగా డాక్టర్ సోమేశ్వర్, కుమార్‌యాదవ్ హాజరయ్యారని, జట్టుకు ఎంపికైన క్రీడాకారులను వారు అభినందించినట్టు పేర్కొన్నారు.

'కార్తీక' పూజలకు ఏర్పాట్లు

ఫతేనగర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భరత్‌నగర్ కాలనీ హరిహర క్షేత్రంలో కార్తీక మాసోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు పూజలు ఉంటాయన్నారు. ఆలయ అర్చకులు కృష్ణసూరి పర్యవేక్షణలో పూజలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో శక్తి కేంద్రం, ఆధ్యాత్మిక క్షేత్రమైన శ్రీహరిహర క్షేత్రానికి భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించాలని ఆయన కోరారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన



గాయత్రి నగర్‌లో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ నేతలు

అల్లాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ గాయత్రి నగర్‌లో మంగళవారం బీజేపీ సీనియర్ నేత రాంగోపాల్ సింగ్ ఆధ్వర్యంలో చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి స్పందన లభించింది. కార్యక్రమానికి బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి సద్గుణ రెడ్డి హాజరయ్యారు. బీజేపీ నేతలు గంగాధర్, సందీప్, వెంకట్‌రాంరెడ్డి, జలంధర్, గోనెల సుదర్శన్ ముదిరాజ్, శ్రీనివాస్, నవీన్, రాజ్‌కుమార్, విజయ్, రాజు, రంజిత్ భారతీయ జనతా పార్టీ యువ మోర్చా ప్రతినిధులు పాల్గొన్నారు.

జయశంకర్‌నగర్‌లో...

ఓల్డుబోయినపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జయశంకర్‌నగర్‌లో మంగళవారం చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోంది. పార్టీ నాయకులు కార్యకర్తలు డివిజన్‌లో పర్యటిస్తూ యువతీ యువకులను పార్టీలో సభ్యులుగా చేర్చుకుంటూ సభ్యత్వం ఇస్తున్నారు.



జయశంకర్‌నగర్‌లో బీజేపీ సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

పన్నులు పెంచడానికేనా అధికారంలోకొచ్చింది

- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే కృష్ణారావు ఆగ్రహం



క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఫతేనగర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా బీఆర్‌ఎస్ పార్టీపై, పార్టీ నేతలపై కక్ష్యపూరితంగా వ్యవరించడం సిగ్గుచేటని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మండిపడ్డారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫతేనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి వారికి దిశా నిర్దేశం చేశారు. డివిజన్ సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులు నిధులు లేక కొన్ని నిలిచిపోతే మరికొన్ని నత్తనడకన నడుస్తున్నాయన్నారు. వీధి దీపాల నుంచి మొదలుకొని రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధికుక్కల సమస్యల వరకు పరిష్కారానికి నోచుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సింది పోయి పన్నులు పెంచడంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెడుతోందని అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై దృష్టిపెట్టి పార్టీ నాయకులు కార్యకర్తలు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు కంచి భిక్షపతి, రాములు, సుదర్శన్‌రెడ్డి, కన్నయ్య, బాలకృష్ణ, శశి, నందకుమార్, శంకర్‌గౌడ్, అఫ్జల్, సలావుద్దీన్, కె.రాము, రాజ్‌కుమార్, సతీష్, మహేంద్ర, సాగర్, రాంరెడ్డి, భాగ్య, డేవిడ్, సురేందర్‌నాయుడు, శిల్ప, కృష్ణకుమారి, రహిమ, బాలామణి, జ్యోతిగౌడ్ పాల్గొన్నారు.

స్థాయి తెలుసుకొని మాట్లాడాలి..

కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నాయకుడి వాఖ్యలపై ఎమ్మెల్యే కృష్ణారావు మండిపడ్డారు. తనను రాజీనామ చేసి గెలవమని చెప్పడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తానేమి పార్టీ మారలేదని అలాంటప్పుడు రాజీనామా చేయాల్సిన అవసరం ఏముందో స్పృహలో ఉండి మాట్లాడాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు సదరు నేతలంతా ఎక్కడ దాక్కున్నారో ప్రజలకు తెలుసునని ఎద్దేవా చేశారు. తనను అత్యధిక మెజారిటీ గెలిపించిన ఓటరు దేవుళ్లకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారిని కంటికి రెప్పలా కాపాడుకోవడమే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు.

స్నేహపురి కాలనీలో పర్యటన

అల్లాపూర్: మూసాపేట్ డివిజన్‌లోని పలు కాలనీల్లో మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యటించారు. రామారావు నగర్, కబీర్ నగర్‌లలో నిర్మాణంలో ఉన్న నాలా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సత్వరమే నాలా, రోడ్డు పనులు పూర్తి చేయాలని సూచించారు. మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్‌తో పాటు పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేసిన ఎమ్మెల్యే కృష్ణారావు మౌలిక వసతులు, నాలా పరిస్థితిని ఎకరువు పెట్టారు. అందుకు స్థానికులు నాలా స్లాబును సత్వరమే నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, అంబటి శ్రీనివాస్, నాగుల సత్యం, తిరుపతి, వినోద్, జలమండలి మేనేజర్ విలియం ప్రకాష్ పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 86 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళా ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ మహేందర్

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మూసాపేట్ వార్డు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 86 మందికి ఉద్యోగాలు కల్పించినట్టు కార్పొరేటర్ మహేందర్ తెలిపారు. మ్యాజిక్ బస్సు, వీర్ సావర్కర్ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు 466 మంది నిరుద్యోగులు హాజరుకాగా, పలు కంపెనీల ప్రతినిధులకు కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ మోసానికి యువకుడి బలి

మల్కాజిగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో సైబర్ మోసానికి గురై అధికమొత్తంలో డబ్బులు పోగొట్టుకున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి గౌతంనగర్‌లో కె.వంశీకుమార్(31) జిమ్ నిర్వహిస్తున్నాడు. వంశీకుమార్ తండ్రి వెంకటేశ్వర కుమార్ రైల్వే ఏఎస్‌ఐగా విధు లు నిర్వహిస్తున్నాడు. వంశీకుమార్ ఇటీవల ఆన్‌లైన్ మోసాలకు గురై అధిక మొత్తంలో డబ్బులు పోగొట్టుకున్నాడు. తన తండ్రిని సైతం ఫైనాన్సియల్ సపోర్టుచేయమని అడిగాడు. ఈ నెల 27న జిమ్‌కు వెళ్ళిన కుమారునికి వెంకటేష్‌కుమార్ ఫోన్‌చేయగా ఫోన్‌లిఫ్ట్ చేయలేదు. జిమ్‌కు వెళ్లి చూడగా అక్కడ జిమ్‌లో సీలింగ్‌కు వంశీకుమార్ ఉరేసుకుని కనిపించాడు. కిందకు దించి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు తెలిపారు.

'డబుల్' ఇళ్లు ఇప్పిస్తానని మోసం

- కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు

హైదర్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సొంతింటి కోసం ఆరాటపడే పేదల ఆశను ఆసరాగా చేసుకొని డబ్బులు కడితే ఇళ్లు ఇప్పిస్తానని ఓ వ్యక్తి మోసానికి పాల్పడిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం.. బోయినపల్లికి చెందిన వేణుగోపాల్ దాస్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ ప్రాంతాలకు చెందిన పలువురు మహిళలకు నమ్మబలికాడు. ఒక్కొక్కరి వద్ద రూ.1.75 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు వసూలు చేశాడు. ఇలా 15 మంది నుంచి రూ. 25 లక్షలు వసూలు చేశాడు. ఎంపీ ఎలక్షన్ అయిపోయిన తర్వాత డబ్బులు ఇచ్చిన వారందరికీ ఇళ్లు వస్తాయని చెప్పాడు. ఎన్నికల తర్వాత బాధితులకు నకిలీ పత్రాలు, నకిలీ తాళాలు అందజేశాడు. ఇళ్ల పత్రాలు, తాళాలు తీసుకున్న వారు దుండిగల్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల దగ్గరికి వెళ్లి చూస్తే అసలైన లబ్ధిదారులు అక్కడ ఇళ్లల్లో ఉండడంతో మోసపోయినట్లు గుర్తించారు. మంగళవారం బాధిత మహిళలు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు చెప్పగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయాలని బాధితులకు సూచించారు. ఈ మేరకు 8 మంది బాధితులు కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాధితులు సుమారు 15 నుంచి 20 మంది ఉన్నట్టు తెలుస్తోంది.

ధన్వంతరి నారాయణమూర్తి జయంతి



తమ కులదైవమైన ధన్వంతరి నారాయణమూర్తి జయంతిని పురస్కరించుకొని కేపీహెచ్‌బీ నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అధ్యక్షులు పన్నాడి రమేష్, తాటిపాముల వెంకటేష్, నరసింహ, కృష్ణ, మహేష్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- కేపీ హెచ్‌బీకాలనీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి)

ఇక్కడ చెత్త వేయొద్దు



గాయత్రీనగర్ లైబ్రరీ పార్క్ వద్ద ఖాళీ ప్లాట్‌లో డంప్ చేసిన చెత్త

అల్లాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గాయత్రీ నగర్ లైబ్రరీ పార్కు వద్ద నిత్యం చెత్త డంప్ చేడంతో పార్కుతోపాటు పరిసర అపార్టుమెంట్లు, ఇండిపెండెంట్ ఇళ్ల నివాసితులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకు ఓ పక్క పార్కు ప్రహరీ, మరో పక్క ఖాళీ ప్లాటు ఉండడంతో కొంత నిర్మానుష్యంగా ఉంది. ఈ ప్రాంతం ఓ చెత్త డంప్‌లా తయారైందని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పుడు మాత్రమే అక్కడి నుంచి చెత్తను తరలిస్తున్నారు. అధికారులు చెత్త డంప్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ఇక్కడ చెత్త వేయొద్దంటూ చెత్త వేసేవారిని కూడా స్థానికులు కోరుతున్నారు.

క్యూబాకు మద్దతుగా సీఐటీయూ నిరసన



నర్సాపూర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

బాలానగర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): క్యూబా దేశంపై అమెరికన్ సామ్రాజ్యవాద నిరంకుశ, నిర్బంధాన్ని నిరసనిస్తూ క్యూబాకు మద్దతుగా సీఐటీయూ నాయకులు బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా వద్ద ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ సీనియర్ నాయకుడు బీ.ఎస్. సుదర్శన్, సీఐటీయూ జిల్లా సమాఖ్య కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ.. క్యూబాకు వ్యతిరేకంగా అమెరికా విధించిన ఆర్థిక వాణిజ్య దిగ్బంధనానికి ముగింపు పలకాలన్నారు. 63 సంవత్సరాల దిగ్బంధనం వలన క్యూబా ఆర్థికంగా 164.14 బిలియన్ డాలర్లు నష్టపోయిందన్నారు. కరోనా విపత్తు కాలంలో అతిచిన్న దేశమైన క్యూబా 52 దేశాలకు వారి దేశానికి చెందిన డాక్టర్లను పంపి కరోనాతో పోరాడుతున్న వారిని ఆదుకున్న పెద్ద మనసున్న దేశంగా వారు అభివర్ణించారు. అలాంటి దేశంపై అమెరికా సామ్రాజ్యవాదం నిర్బంధానికి ముగింపు పలికేలా ఐక్యరాజ్యసమితితో తీర్మానం జరిగేలా ప్రపంచ దేశాలు క్యూబాకు అండగా నిలవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అమిత్ కెపాసిటర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ మల్లేష్, లక్ష్మి, సబిత, నానీ, వనిత, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులపై దురుసు ప్రవర్తన

- యువకుడిపై కేసు

బంజారాహిల్స్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నేనేమైనా నక్సలైట్‌నా, టెర్రరిస్టునా అంటూ ట్రాఫిక్ పోలీసులపై చిందులేసిన యువకుడిపై కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీలు చేపడుతుండగా మంగలి శ్రీనివాస్ ఓ యువతితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. పోలీసులు తనిఖీ చేయగా 8చలానాలు ఉండటంతో చెల్లించాలని చెప్పడంతో పోలీసులపట్ల దురుసుగా ప్రవర్తించాడు. ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ శాంతిభద్రతల పోలీసులు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు పిల్లలు, తల్లి ఆత్మహత్యాయత్నం

బోరబండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కన్సల్టెన్సీ వ్యాపారంలో నష్టం రావడంతో ముగ్గురు పిల్లలతో సహా తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బోరబండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతినగర్‌లో డాక్టర్ వెంకట్, భార్య సుజాత(38), లౌక్య(18), అమృత (15)అనిరుధ్(9) ఉంటున్నారు. వ్యాపారంలో నష్టం రావడంతో కొంతకాలంగా మనోవేదనకు లోనయ్యారు. ఈ నేపథ్యంలో సుజాత తన ముగ్గురు పిల్లలతో సహా థైరాయిడ్ వ్యాధికి సంబంధించిన మాత్రలను మింగి ఆత్మహత్యకు యత్నించారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

కాలుష్య నిబంధనలను ఉల్లంఘిస్తే పరిశ్రమలను మూసివేస్తాం

- టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి హెచ్చరిక

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కాలుష్య నిబంధనలను ఉల్లంఘించిన పరిశ్రమలను మూసి వేయడంతో పాటు యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) సభ్య కార్యదర్శి రవి హెచ్చరించారు. కాలుష్యం, దుర్వాసన సమస్యలపై నగరంలోని పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో పీసీబీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. పారిశ్రామిక ప్రాంతాల్లో దుర్వాసనను నియంత్రించడంలో పారిశ్రామిక సంఘాలు క్లస్టర్ల వారీగా కీలకపాత్ర పోషించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిని సంఘాల ప్రతినిధులు గుర్తించకపోతే, ఆ ప్రాంతంలోని అన్ని పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిర్ణీత సమయంలో టాస్క్‌ఫోర్స్ అధికారులందరూ తనిఖీలు నిర్వహించాలని, పరిశ్రమల్లోని పరికరాల నాణ్యత, నిర్వహణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా గాలి కాలుష్యాన్ని నియంత్రించే స్క్రబర్ల నిర్వహణ కోసం ప్రతి పరిశ్రమలో డ్యూటీ చార్ట్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎఫ్లూయెంట్స్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, వ్యర్థ జలాలను అక్రమంగా విడుదల చేయడాన్ని గుర్తించాలన్నారు. పర్యావరణం పట్ల నిర్లక్ష్యాన్ని టీజీపీసీబీ ఎట్టి పరిస్థితుల్లో సహించబోదన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం టీజీపీసీబీ మొదటి ప్రాధాన్యంగా తీసుకుంటున్నదని సభ్య కార్యదర్శి రవి వెల్లడించారు. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టుపక్కల పారిశ్రామిక బెల్ట్‌లో వెలువడుతున్న దుర్వాసనపై నివాసితుల నుంచి ప్రజావాణి ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా టీజీపీసీబీకి అనేక ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని పరిశీలించి సత్వర చర్యలకు ఆదేశించామన్నారు. తర్వాత ఆయన ఫార్మాస్యూటికల్, కెమికల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు చెందిన పారిశ్రామిక ప్రతినిధులతో దుర్వాసన నియంత్రణ చర్యల అమలు, కాలుష్య నియంత్రణకు మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయడం, పర్యవేక్షణ యంత్రాంగాలను మెరుగుపర్చడం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో చీఫ్ ఇంజనీర్ రఘు, సామాజిక శాస్త్రవేత్త ప్రసన్నకుమార్, జాయింట్ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆదాయం ఉన్నా అద్దె భవనంలోనే

● 17 ఏళ్ల నుంచి అక్కడే కొనసాగుతున్న సూరారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

● రెండేళ్లుగా అద్దె చెల్లించని వైనం
● పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు

షాపూర్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నిత్యం క్రయ విక్రయదారులతో కళకళలాడే రిజిస్ట్రేషన్ కార్యాలయానికి నేడు జనం తాకిడి తగ్గింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం గత కొన్ని రోజులుగా సుమారు 50 కాలనీల వారికి రిజిస్ట్రేషన్లు వక్ఫ్‌బోర్డు భూముల పేరుతో నిలిపివేసిన సంగతి విదితమే. రిజిస్ట్రేషన్‌లు ఆపివేయడంతో కార్యాలయానికి వచ్చే జనం సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయింది. రిజిస్ట్రేషన్‌ల కొరకు నియోజకవర్గం నలుమూల నుంచి ప్రతిరోజు వందలాది డాక్యుమెంట్‌లు దాఖలవుతాయి. క్రయవిక్రయదారుల నుంచి వందల కోట్లు లాభాలు వస్తున్నా కార్యాలయంలో వసతులు మచ్చుకైనా కనిపించవు. మూత్రశాలలు, లిఫ్ట్ లేకపోవడం, పార్కింగ్ సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు గడిచిన నాలుగు నెలల్లో నలుగురు సబ్ రిజిస్ట్రార్లు మారడం, వక్ఫ్ భూముల పేరుతో ఆదాయానికి గండిపడింది. దీనికి తోడు కార్యాలయం 2007 నుంచి ఈ అద్దె భవనంలోనే కొనసాగుతుంది. ప్రభుత్వానికి ఎన్నిమార్లు మెమొరాండంలు సమర్పించినా ఇంతవరకు కార్యాలయాన్ని పట్టించుకొన్న నాధుడే కరువయ్యారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఉన్న వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి భూమి కేటాయించి భవన నిర్మాణం చేపట్టడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు వెయ్యికోట్ల ఆదాయమున్న కార్యాలయానికి సొంత భవనం కరువైంది.

నలుమూలల నుంచి రిజిస్ట్రేషన్‌కు

నియోజకవర్గంలో ఉన్న ఒకే ఒక రిజిస్ట్రేషన్ కార్యాలయం కాబట్టి నలుమూలల నుంచి నిత్యం వందలాది క్రయ విక్రయదారులు కార్యాలయానికి వస్తుంటారు. కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, గాజులరామారం, సూరారం, పేట్‌బషీరాబాద్, బౌరంపేట్, దుండిగల్, శంభీపూర్, బాచుపల్లి, నిజాంపేట్ తదితర ప్రాంతాలకు చెందిన వారికి ఇక్కడే రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయి. ముఖ్యంగా నిజాంపేట్, బాచుపల్లి ప్రాంతాల్లో ఎక్కువ రిజిస్ట్రేషన్ జరుగుతాయి, కాబట్టి ఇక్కడ నుంచే ఆదాయం ఎక్కువగా వస్తుంది. కార్యాలయాన్ని రెండుగా విడదీయాలన్న డిమాండ్ ఉన్నా ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కార్యాలయానికి సొంత స్థలం కేటాయించి అన్ని హంగులతో అధునాతన భవనాన్ని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


ఉమ్మి వేయడంతో అపరిశుభ్రంగా ఉన్న గోడలు


రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలు

సొంత భవనాన్ని నిర్మించాలి

రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి కోట్ల రూపాయలు ఆదాయం ఉన్నా గత 15 సంవత్సరాలుగా సొంత భవనానికి నోచుకోలేదు. వందల ఎకరాలు కబ్జారాయుళ్ళ కబంధ హస్తాల్లో కనుమరుగవుతున్నా పట్టని పాలకులు, వందల కోట్ల ఆదాయం వస్తున్న కార్యాలయానికి మాత్రం స్థలాన్ని కేటాయించి సొంత భవనం నిర్మించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు.



- అంజనేయులు

పార్కింగ్ స్థలం లేక చలాన్లు కడుతున్నాం

రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చేవారికి పార్కింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. వంద రూపాయల ఈసీ కోసం వస్తే వెయ్యి రూపాయలు పోలీసులకు చెల్లించాల్సి వస్తోంది. పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



- చంద్రకాంత్

కాలుష్యకారక పరిశ్రమలను మూసివేస్తాం

● పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రాజేందర్

ఇంటర్వ్యూ...



జీడిమెట్ల, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని పారిశ్రామికవాడల్లో కెమికల్ కంపెనీలు విషవాయువులను పట్టపగలే గాలిలోకి వదిలేస్తున్నారు. రాత్రివేళ ప్రాణాంతకమైన వ్యర్థ జలాలను నాలాల్లోకి వదిలి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో పారిశ్రామికవాడలకు సమీపంలో నివసిస్తున్న కాలనీలు, బస్తీల ప్రజలు విషవాయువుల ఘాటుతో ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. ఈ పరిశ్రమలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని కాలుష్య నియంత్రణ బోర్డు ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రాజేందర్‌ను ప్రశ్నించగా ఆయన పలు విషయాలను ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

● కెమికల్ కంపెనీల నుంచి వచ్చే వ్యర్థ జలాలను రాత్రివేళ వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జీడిమెట్ల పారిశ్రామికవాడపై టాస్క్‌ఫోర్స్, మా సిబ్బంది ప్రత్యేక నిఘాపెట్టింది. ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ విషవాయువులను వదిలే పరిశ్రమలపై చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు మా దృష్టికి తీసుకువచ్చిన వెంటనే స్పందిస్తున్నాం.

● నివాస ప్రాంతాల్లో కెమికల్ గోదాంలు వెలుస్తున్నాయి. దీంతో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. దీనిపై మీ స్పందన ఏమిటి?

కెమికల్ గోదాంలు వెలుస్తున్న మాట వాస్తవమే. ఇవి పీసీబీ పరిధిలోనికి రావు. గతంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో, అన్ని శాఖల సమన్వయంతో గోదాంలు గుర్తించి కొన్నింటిని మూసివేయడం జరిగింది. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే తప్పకుండా వాటిపై చర్యలు తీసుకుంటాం.

● ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న కాలుష్య కారక పరిశ్రమలపై ఏ చర్యలు చేపడుతున్నారు?

ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎంతటి పరిశ్రమనైనా తప్పకుండా మూసివేస్తామని, మా టీంలు నిత్యం నిఘా పెడుతున్నాయని తెలిపారు. నివేదికల ప్రకారం కాలుష్య కారక పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచేందుకు సహకరించాలి: ఎమ్మెల్యే


విద్యార్థులకు నోట్ పుస్తకాలు, కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

గాజులరామారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల విద్య ప్రమాణాలు పెంచేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అక్షయ ఫౌండేషన్ ఛైర్మన్ సురేష్ కుమార్, ప్రధానోపాధ్యాయులు అశోక్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, రామ్‌రెడ్డి, బాలరాజ్, కమలాకర్, చెట్ల వెంకటేష్, ఇబ్రహీమ్‌ఖాన్, నవాబ్, మూసాఖాన్, సంజారెడ్డిలు పాల్గొన్నారు.

దుండిగల్‌లో

శివారు ప్రాంతాల్లో ఏర్పడుతున్న కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపల్ పరిధి, బౌరంపేటలోని జెఎన్‌ఎన్‌యూ ఆర్‌ఎం లక్ష్మీనగర్ కాలనీలో దాదాపు రూ. 80 లక్షలు వెచ్చించి చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఛైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణితో కలిసి మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు బి.బుచ్చిరెడ్డి, మురళీయాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డిల్లీ ఈశ్వర్‌రావు, కార్యదర్శి తిరుపతిరెడ్డి, కామేశ్వరరావు, లక్ష్మణ్, శ్యామ్, బాబి, కాలనీవాసులు ఉన్నారు.


జేఎన్ఎన్‌యూ ఆర్‌ఎం లక్ష్మీనగర్ కాలనీలో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● కూన శ్రీశైలంగౌడ్

షాపూర్‌నగర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందేలా చూస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని పలు కాలనీలకు చెందిన నాయకులు, పద్మనగర్ ఫేజ్-1 నూతన కార్యవర్గ అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు శ్రీశైలంగౌడ్‌ను షాపూర్‌నగర్‌లో తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో కెకెఎం ట్రస్ట్ ఛైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్, కాలనీ సంక్షేమ సంఘ సంక్షేమ నాయకులు సత్తిరెడ్డి, దయాకర్, ముత్యాలు, వెంకటేశ్వరరావు, శివనాగిరెడ్డి, కాశీం, శ్రీకాంత్, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ సంఘం నాయకులతో కూన శ్రీశైలంగౌడ్

సంక్షేమ సంఘాల సభ్యుల ఐక్యతతోనే కాలనీలు అభివృద్ధి

జీడిమెట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ సంఘాల సభ్యుల ఐక్యతతోనే కాలనీల్లో అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. పద్మానగర్ ఫేజ్-1 కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

కాలనీల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకు వస్తే తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేకేఎం ట్రస్ట్ ఛైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్, సత్తిరెడ్డి, దయాకర్, ముత్యాలు, వెంకటేశ్వరరావు, శివనాగిరెడ్డి, ఖాసీంపీరా, జైసింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

దుండిగల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపల్‌లోని 5వ రోడ్డు సాయిబాబానగర్‌లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్ శ్రీవిద్యా ప్రశాంత్‌గౌడ్, కాలనీ వాసులు విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. త్వరలోనే సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు.


ఏఈ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్ శ్రీవిద్యా ప్రశాంత్‌గౌడ్

స్వర్ణ భారత మహోత్సవం

గురు సాంగత్యంతో మంచి ప్రవర్తన, సరైన నడవడిక సమకూరుతాయని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపల్ పరిధిలోని నార్త్ ఎన్‌సీఎల్ కాలనీలో స్వర్ణ భారత మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సన్నా శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ సన్నా కవిత, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శిరీషా, ప్రవీణ్‌రావు, వేణు, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

- దుండిగల్ (ఆంధ్రజ్యోతి)





సంఘీభావం

క్యూబాపై అమెరికా ఆంక్షలను ఉపసంహరించుకోవాలని అమెరికా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎ.అశోక్ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. అమెరికా ఆంక్షలకు నిరసనగా అక్టోబర్ 29న దేశ వ్యాప్తంగా క్యూబాకు సంఘీభావం ప్రదర్శనలో భాగంగా కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9 గంటలకు షాపూర్‌నగర్ రైతు బజార్ నుంచి సాగర్ హోటల్ చౌరస్తా వరకు సంఘీ భావ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, దేవదానం, నాగరాజు, బి. సత్యం, శంకర్, నాయకులు పాల్గొన్నారు.

- షాపూర్‌నగర్ (ఆంధ్రజ్యోతి)

గాజులరామారం డివిజన్‌లో పర్యటించిన డీసీ

గాజులరామారం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్‌లోని పలు బస్తీల్లో గాజులరామారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డితో కలిసి మంగళవారం పర్యటించారు. అనంతరం కాలనీల్లో నెలకొన్న సమస్యలను స్థానికులు మల్లారెడ్డి దృష్టికి తీసుకురాగా, త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని వారికి కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


కాలనీలో పర్యటిస్తున్న డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి : ఏఐఎస్ఎఫ్

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం అన్యాయం అని ఏఐఎస్ఎఫ్ పేర్కొంది. అధికారంలోకి వస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చిందని, బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాన్‌ప్రొఫెషనల్ విద్యార్థులకు రూ.2000 కోట్లు, ప్రొఫెషనల్ విద్యార్థులకు రూ.4000 కోట్ల ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



కొంపల్లి మున్సిపాలిటీలోని 11, 12 వార్డుల్లో మహిళామోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సరితారావు, మహిళామోర్చా నాయకురాలు మాధురి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

- దుండిగల్ (ఆంధ్రజ్యోతి)

డ్రాఫ్ట్ ఓటర్ లిస్టు విడుదల

● డీసీ నర్సింహ్మా

కుత్బుల్లాపూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం డ్రాఫ్ట్ ఓటర్ లిస్టును మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, సర్కిల్ డీసీ నర్సింహ్మా తన కార్యాలయంలో ప్రకటించారు. ఈ లిస్టులో ఎవరైనా అభ్యంతరాలు ఉంటే ఫారం-6, 7, 8, 8ఏ ద్వారా నవంబరు 28 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో 7,31,517 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 3,81,406 మంది పురుషులు, 3,49,946 మంది స్త్రీలు, టీజీ-165, సర్వీస్ ఓటర్లు-104 మంది ఉన్నారని పేర్కొన్నారు.


డ్రాఫ్ట్ ఓటర్ లిస్టును ప్రకటించిన ఎలక్టోరల్ అధికారి

ఘనంగా స్వర్ణ భారత మహోత్సవం

దుండిగల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపల్ పరిధిలోని నార్త్ ఎన్‌సీఎల్ కాలనీలో స్వర్ణ భారత మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్‌సింహారెడ్డి హాజరై శ్రీ భారత తీర్థ మహాస్వామి వారి గురుపాదుకా పూజలో పాల్గొన్నారు. శ్రీదుర్గాదేవి సేవాసమితి, రాచర్ల రవి చంద్రవర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమం నిర్వహించారు.


పూజల్లో పాల్గొన్న భరత్‌సింహారెడ్డి

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా వర్సిటీలో అభ్యసిస్తున్న పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు సివిల్స్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సివిల్ సర్వీస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండ నాగేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు, ఇతర వివరాలు ఓయూ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని, నవంబరు 8లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కొలువు దీరిన టపాసుల దుకాణాలు


షాపూర్‌నగర్ రైతుబజార్ వద్ద ఏర్పాటుచేసి స్టాల్స్

ప్రతి ఒక్కరు ఆనందంగా దీపావళి జరుపుకొనేందుకు మార్కెట్లలో బాణాసంచా దుకాణాలు వెలిశాయి. గాజులరామారం ప్రధాన రహదారిలోని జలమండలి కార్యాలయం, షాపూర్‌నగర్ రైతుబజార్ వద్ద స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఎటువంటి ప్రమాదానికి గురికాకుండా ఆహ్లాదకర వాతావరణం మధ్య పండుగ జరుపుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

- షాపూర్‌నగర్ (ఆంధ్రజ్యోతి)


అమ్మకానికి సిద్ధంగా ఉన్న డెకరేషన్ వస్తువులు

క్యూబాపై దాడిని నిరసిస్తూ సీఐటీయూ నాయకులు నిరసన

దుండిగల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): క్యూబాపై అమెరికన్ సామ్రాజ్యవాద నిరంకుశ నిర్బంధాన్ని ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ బాచుపల్లి మండల సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసనను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ సోషలిస్ట్ క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలని ఐరాసలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.అమెరికా క్యూబాను తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశంగా పరిగణిస్తుందని, ఇది ఆ దేశ ఆర్థిక బ్యాంకింగ్ లావాదేవీలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. క్యూబాలో మౌలిక సదుపాయాలపై అమెరికా ఉద్దేశపూర్వకంగా నిషేధాలు, షరతులను అమలు చేస్తుందన్నారు. దీంతో క్యూబా ప్రజలు దయనందిన జీవితాన్ని, అంతులేని కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. సోషలిస్ట్ వ్యవస్థను కాపాడుకోవడమే లక్ష్యంగా పోరాడతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రభుదాస్, ప్రకాష్, వెంకటేష్, యూనియన్ అధ్యక్షులు సయ్యద్ జమీల్, ఎండీ కలీమ్, ఎండీ కలీల్, నర్సింహాచారి పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

జీహెచ్‌ఎంసీ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

జీడిమెట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు లేదా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని తెలంగాణ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ ఐఎన్‌టీయుసీ అధ్యక్షుడు ఎం.జనార్ధన్‌తో కలిసి కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిల్ పరిధిలోని వివిధ డివిజన్‌లలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్మికులు తాము అద్దె ఇళ్లలో ఉంటున్నామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ పారిశుధ్య కార్మికులకు ఇళ్లు కేటాయించాలని కోరారు.


కార్మికులతో మాట్లాడుతున్న ఐలయ్య

నిబంధనలను ఉల్లంఘిస్తే పరిశ్రమలను మూసివేస్తాం

● టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కాలుష్య నిబంధనలను ఉల్లంఘించిన పరిశ్రమలను మూసివేయడంతో పాటు యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) సభ్య కార్యదర్శి రవి హెచ్చరించారు. కాలుష్యం, దుర్వాసన సమస్యలపై నగరంలోని పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో పీసీబీ ప్రధాన కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. నిర్ణీత సమయంలో టాస్క్‌ఫోర్స్ అధికారులందరూ తనిఖీలు నిర్వహించాలని, పరిశ్రమల్లోని పరికరాల నాణ్యత, నిర్వహణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. గాలి కాలుష్యాన్ని నియంత్రించే స్క్రబర్ల నిర్వహణకు ప్రతి పరిశ్రమలో డ్యూటీచార్ట్‌లు ఏర్పాటుచేసుకోవాలన్నారు.

ప్రజారోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం..

ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం టీజీపీసీబీ మొదటి ప్రాధాన్యంగా తీసుకుంటున్నదని సభ్య కార్యదర్శి రవి వెల్లడించారు. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టుపక్కల పారిశ్రామిక బెల్ట్‌లో వెలువడుతున్న దుర్వాసనపై నివాసితుల నుంచి ప్రజావాణి పోర్టల్ ద్వారా టీజీపీసీబీకి అనేక ఫిర్యాదులు అందాయని, వాటిని పరిశీలించి చర్యలకు ఆదేశించామన్నారు. ఆ తర్వాత ఆయన ఫార్మాస్యూటికల్, కెమికల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు చెందిన పారిశ్రామిక ప్రతినిధులతో దుర్వాసన నియంత్రణ చర్యల అమలు, కాలుష్య నియంత్రణకు మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయడం, పర్యవేక్షణ యంత్రాంగాలను మెరుగుపర్చడం తదితర అంశాలపై చర్చించారు.

సమావేశంలో చీఫ్ ఇంజనీర్ రఘు, సామాజిక శాస్త్రవేత్త ప్రసన్నకుమార్, జాయింట్ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.